క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారికి ఆదివారం ప్రత్యేక రోజు కావడంతో సాంప్రదాయం ప్రకారం ప్రతీ వారం మాదిరిగానే ఉదయం 5 గంటలకు అభిషేకాలు ప్రారంభించి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేవస్థానం వద్ద మధ్యాహ్నం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్‌ల నేతృత్వంలో దాతల సహకారంతో అన్నదానం చేశారు.

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: మైనర్లకు ద్విచక్ర వాహనాలిస్తే సంబంధిత వాహన యజమానిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ భాస్కరరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి కేసులు నమోదు చేసి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఎల్.కోటలో నేత్రవైద్య శిబిరం



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్నా ఆప్తాలమిక్ రత్న

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డులో వైజాగ్ ఆప్టిక్స్ వద్ద జిల్లా అంధత్వ నివారణసంస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ రత్న 52 మందికి నేత్ర పరీక్షలు చేసి 15మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించి, మందులు కళ్లద్దాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మహమద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రాజాం సిటీ: మొక్క నాటుతున్న మహిళలు

బొబ్బిలి రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పక్కి గ్రామ ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈవో మొక్కలు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి ముందుకురావాలని, మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, కె.కృష్ణదాస్, వి.ఎన్.శర్మ తదితరులు పాల్గొన్నారు.
రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో వికాస తరంగిణి మహిళా యోగా సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. మొక్కల పెంపకంతోనే జీవకోటి మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య వికాస్ కో-ఆర్డినేటర్ ఎ.లలిత, దాసరి పద్మ, లేపాక్షి, వికాస తరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, సెంట్రల్ కమిటీ కార్యదర్శి టి.టి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్లతో ఇక్కట్లు



గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద రైల్వే గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు



జమ్మాదేవిపేట వద్ద రద్దీలేని ప్రాంతంలో నిర్మించిన ఆర్ఓబీ

లక్కవరపుకోట: కొత్తవలస- కిరండోల్(కేకే లైన్) రైల్వే లైన్‌లో మండలంలోని మల్లివీడు రైల్వేస్టేషన్ సమీపంలో గోల్డుస్టార్ జంక్షన్ ,సంతపేట జంక్షన్ సమీపంలోని రైల్వే గేట్లతో ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు. కేకే లైన్‌లో కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం, మంగళపాలెం, కొత్తవలస, అడ్డుపాలెం, నిమ్మలపాలెం గ్రామాలకు వెళ్లే మార్గాల్లో రైల్వే అండర్ బ్రిడ్జిలు(ఆర్‌ఓబీలు) నిర్మించారు.అలాగే ఎల్.కోట మండలంలో గంగుబూడి, జమ్మాదేవిపేట, రంగరాయపురం జంక్షన్‌ల వద్ద, ఎస్.కోట మండలంలోని దాంపురం, కొత్తూరు జంక్షన్‌ల వద్ద, కొత్తవలస మండలంలోని సుకంర పాలెం, కంటకాపల్లి రైల్వేస్టేషన్ సమీపాల్లో అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. అయితే అత్యంత రద్దీగా ఉండే గోల్డుస్టార్ జంక్షన్, సంతపేట జంక్షన్‌ల వద్ద అండర్ బ్రిడ్జిలు నిర్మించలేదు. అనకాపల్లి జిల్లా అనందపురం నుంచి రేగ, కళ్లేపల్లి, శ్రీరాంపురం, కోనమసివానిపాలెం, తామరాపల్లి, రెల్లిగౌరమ్మపేట, కొత్తపాలెం తదితర గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. ఈమార్గం రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉండడంతో రైళ్ల రాకపోక సమయాల్లో తరచూ రైల్వే గేటు గంటల తరబడి మూసి ఉంచడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అంతే కాకుండా స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, మా మహామాయ కర్మాగారాలకు ముడిసరుకు, ఉత్పత్తులను తరలించే భారీ వాహనాలు గేటు వేసిన సమయంలో పెద్ద ఎత్తున బారులు తీరుతున్నాయి. దీంతో అరుకు-విశాఖ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి పోతోంది. గేటుపడితే సుమారు వాహనాలకు అరగంటకుపైగా, ఒక్కోసారి గంటకుపైగా నిరీక్షణ తప్పడంలేదు. విద్యార్థులు, ఉద్యోగులు,అత్యవసరంగా ఆస్పత్రులకు వెళ్లేవారికి ఈ గేట్లు పెద్ద శాపంగా మారాయి. అవసరం ఉన్న చోట కాకుండా అవసరం లేని చోట రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మించారని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే గోల్డుస్టార్,సంతపేట జంక్షన్‌ల వద్ద రైల్వే అండర్‌బ్రిడ్జిల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యారావు సేవలు ఎనలేనివి



సత్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి తదితరులు

బొబ్బిలి: డాక్టర్ రెడ్డి సత్యారావు సేవలు ఎనలేనివి అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. స్థానిక పట్టణంలోని ఓంకార్ థియేటర్ వద్ద జరిగిన సత్యారావు స్మృత్యంజలి కార్యక్రమానికి ఆదివారం హాజరైన జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడులు సత్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. బొబ్బిలి పట్టణంతో పాటు పట్టణ పరిసర గ్రామాల్లోని ఎంతోమందికి వైద్యసేవలు అందించి వారి ప్రాణాలు కాపాడిన గొప్ప వైద్యుడు సత్యారావు అని, ఆయన సేవలు మరువలేని అని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సత్యారావు కుమారులు డాక్టర్ రెడ్డి రవికుమార్, డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, ఆర్.వి.ఎల్.ప్రసాద్, ఆర్.వి.శేషగిరి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు టి.భాస్కరరావు, జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జిలు రేజేటి ఈశ్వరరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న రమణ

చీపురుపల్లి: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతిగృహ సముదాయంతో పాటు పలు ప్రాంతాల్లో సంచార గ్రంథాలయ సేవలు అందించడంతో పాటు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాల్లో మొబైల్స్, టీవీ, సినిమాల పేరుతో కాలయాపన చేయకుండా పుస్తక పఠనం చేయాలని సూచించారు.పెద్దలు కూడా పుస్తక పఠనం చేయడం ద్వారా పిల్లల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. పలువురు విద్యార్థులకు నీతికథల పుస్తకాలు పంపిణీ చేశారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రంజిత్‌కుమార్



రంజిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యసంఘం పెద్దలు

జామి: మండల ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడిగా కాపుగంటి రంజిత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తవలసలో ఆదివారం విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గాల ఎన్నిక, ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. మండల సంఘం అధ్యక్షుడిగా రంజిత్ కుమార్‌తో పాటు ప్రధాన కార్యదర్శిగా కుసుమంచి సురేష్, కోశాధికారిగా గాది రాము ఎన్నికయ్యారు. వీరిని మండల ఆర్యవైశ్యసంఘం పెద్దలు విన్నకోట సీతారామయ్య, ఇండుపూరి సుబ్బరాజు, కె.కృష్ణారావు, డి.రామకృష్ణ సన్మానించారు.

ఆధ్యాత్మిక భావం పెరగాలి



ప్రవచనం చేస్తున్న రుద్ర కోటేశ్వరశర్మ



శత చండీ యాగం చేస్తున్న రుత్వికులు

గుర్ల: ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మిక భావం పెరగాలని ఖండ్యాం శారదా పీఠం గురువు అంపో లు రుద్ర కోటేశ్వర శర్మ అన్నారు. లోకశాంతి కోసం మండల కేంద్రంలోని శివాలయంలో అర్చకులు ఆర వెల్లి సురేష్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహారుద్రాభిషేకం, హోమాలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ప్రతి ఒక్కరూ అనాలోచిత నిర్ణయాలను తగ్గించుకొని, సహాయం చేసే గుణం అలవాటు చేసుకువాలని సూచించారు. అంతా ధర్మం పాటించాలని, అదే ముక్తిమార్గమన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అందాల బోడికొండ..



చెరువుతో పాటు సుందరంగా దర్శనమిస్తున్న రామతీర్థం బోడికొండ

నెల్లిమర్ల రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని సీతారామునిపేట సమీపంలో ఉన్న చెరువులో నీరు పుష్కలంగా చేరింది. నిండు కుండలా ఉన్న చెరువుతో పాటు ఎదురుగా ఉన్న రామతీర్థం బోడికొండ అందగా దర్శనమిస్తోంది. దీంతో సీతారామునిపేట - దన్నానపేట రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు కాసేపు నిలిచి ప్రకృతి అందాన్ని తిలకిస్తున్నారు. చెరువుతో పాటు బోడికొండ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

గో హంతకులపై చర్యలు తీసుకోవాలి

- గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ



కబేలా వద్ద నిరసన తెలియజేస్తున్న రామకృష్ణ, తదితరులు

విజయనగరం ఫోర్ట్: గో హంతకులపై చర్యలు తీసుకోవాలని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని స్వర్గధామం వద్ద ఉన్న కబేలా వద్ద ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 20 సంవత్సరాలుగా ఆవును వధిస్తూ మాంసాన్ని ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నా గోవధ ఆగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సోంబాబు, నీలావుదేవి, విశ్వనాథపల్లి రవికిరణ్, రవిశంకర్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపా రు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని సూచించారు.

సీపీఐ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

గజపతినగరం: సీపీఐ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైందని గజపతినగరం నియోజకవర్గ కన్వినింగ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం ఎన్నిక నిర్వహించినట్లు పేర్కొన్నారు. సీపీఐ మండల కన్వీనర్‌గా గేదెల రామునాయుడు, కో-కన్వీనర్‌గా పురం అప్పారావు, సభ్యులుగా సంగిరెడ్డి నారాయణరావు, పల్లా నారాయణప్పుడు, గర్భాపు చిట్టిబాబు, సారిపి చంద్రుడు, పిన్నింటి శ్రీను ఎన్నికయ్యారని తెలిపారు.

ఎరువుల కొరత

మెరకముడిదాం: మండలంలో ఖరీఫ్ వరి, మొక్కజొన్న పంటల సాగు పనులు ప్రారంభమయ్యారు. అయితే సరిపడా ఎరువులు లభించకపోవడంతో రైతులుఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో వరి సాధారణ సాగువిస్తీర్ణం 2,946 హెక్టార్లు, మొక్కజొన్న 483 హెక్టార్లలో సాగు చేస్తుంటారు. అందుకు తగిన విధంగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లభించకపోవడంతో రైతులు అధికమొత్తం చెల్లించి ప్రైవేటు డీలర్ల వద్ద కొను గోలు చేసుకోవాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించిఅన్ని రకాల ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

జామి: పద్మనాభం 33 కేవీ ఫీడర్ పరిధిలో మండలంలో ఉన్న విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఫీడర్ పరిధి గ్రామాలకు మంగళవారం విద్యు త్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దేముడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కుమ రాం , బలరాంపురం, ఏ.ఆర్.పేట, కోరుకొండ గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుటుంబ సభ్యుల చెంతకు మతిస్థిమితం లేని వ్యక్తి

విజయనగరం క్రైమ్: మతిస్థిమితం కోల్పోయి విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కిన రాజస్థాన్ వ్యక్తిని ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ నెల 25న సీతం కళాశాల వద్ద ఉన్న విద్యుత్ టవర్ ఎక్కి హడావిడి చేసిన వ్యక్తికి సంబంధించిన వివరాలను తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు వారిని ఆదివారం స్టేషన్‌కు పిలిపించి సీఐ బి.వెంకటరావు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుసు దొంగల అరెస్ట్

విజయనగరం క్రైమ్: మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 25న సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో ఉన్న కోట జంక్షన్ వద్ద సుమారు 61 ఏళ్ల వయసు కలిగిన మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి తెంచుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు నిందితులు సోము గంగరాజు, అదేవిధంగా లంకాపట్టణానికి చెందిన మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గంగరాజును రిమాండ్‌కు పంపించగా.. మైనర్‌ను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కొని దుండగులు పరారీ



సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన నిందితులు



బాధితుడు గౌరీ శంకరరావు

రాయగడ: స్థానిక రైల్వే రన్నింగ్ రూమ్ ప్రాంతంలో ఒక వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని గుర్తు తెలియని ఇద్దరు దుండగులు పరారైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించారు. ఐఐసీ కేకేబీకే కుహరో తెలిపిన వివరాల ప్రకారం పొరుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన గేదెల గౌరీ శంకరరావు అనే వ్యక్తి తన బంధువులతో కలిసి మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి ఆదివారం వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ సరళా కూడలి వైపుగా వెళ్తున్న సమయంలో రైల్వే రన్నింగ్ రూమ్ సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బైకుపై అడ్డంగా వచ్చారు. అనంతరం బాధితుడు ఎవరితోనే ఫోన్‌లో మాట్లాడుతుండగా లాక్కొని పరారయ్యారు. దుండగులు వినియోగించిన బైక్ ఆధారంగా రాయగడ జిల్లాలోని కొలనార సమితి కైలాస్‌పూర్ చందిపకొన గ్రామానికి చెందిన ముకున పిడికగా గుర్తించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని స్పష్టం చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

- టూటౌన్ సీఐ రామారావు



డాల్ఫిన్ హైట్స్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ రామారావు

విజయనగరం క్రైమ్: సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావు సూచించారు. ఆదివారం స్థానిక జమ్మునారాయణపురం డాల్ఫిన్ హైట్స్‌లో సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొబైల్‌కు వచ్చిన లింక్‌లను అనవసరంగా క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతామని ఫోన్లు చేసి మాయ మాటలు చెప్పడం, ఇంట్లో ఉంటూ వర్క్ చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశచూపడం, ఏటీఎం కేంద్రాల్లో కార్డులను మార్చడం వంటి మోసాలు ఎక్కువగా జరుగుతుంటాయని చెప్పారు. వాట్సాప్‌లో తెలియని వీడియో కాల్స్‌ను లిఫ్ట్ చేయడద్దని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల పేరు చెప్పి ఎవరైనా అపార్ట్‌మెంట్లకు వస్తే వారిని బాగా పరిశీలించాకే, సాయం చేయాలని చెప్పారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా, అనుమానం వచ్చినా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కనీస పింఛన్ రూ. 9 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ కార్మిక సంఘ నాయకులు

నెల్లిమర్ల : రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్మిక సంఘ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు దోచి పెడుతూ, కార్మికులకు కనీస పింఛన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనీస పింఛన్‌పై చర్చించకపోవడం దుర్మార్గమన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నియమించిన భగత్‌సింగ్ కమిటీ కనీస పింఛన్ పెంచాలని సిఫార్సు చేసినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ వచ్చే నెల 6,7,8 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టనున్నామని, రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

శ్రీనాథుడి కవితా వైభోగం అమోఘం..



లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీనాథుని కవితా వైభవం అమోఘమని, దాని గురించి తెలుసుకోవడానికి ఒక జన్మ సరిపోదని విశ్రాంత ఆంధ్రోపాధ్యాయి ముక్కు లింగలక్ష్మి (విశాఖ) అన్నారు. విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాహితీసదస్సులో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనాథుని కవితా వైభవంపై ప్రసంగిస్తూ నన్నయ్య, తిక్కనల ప్రతిభకు సరితూగుతూ, ఆ యుగానికి తర్వాత ప్రబంధయుగానికి మధ్య వారధిగా నిలిచారని కొనియాడారు. శ్రీనాథుడు రచించిన హర విలాసంలోని గౌరీకల్యాణం, భక్త సిరియాళు కథలలో పద్యాలను ఉటంకిస్తూ శ్రీనాథుని కవితా మహత్యాన్ని విశదీకరించారు. అనంతరం లక్ష్మి దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జక్కు రామకృష్ణ, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, భోగరాజు సూర్యలక్ష్మి,చెరుకూరి శ్రీనివాసరావు, భోగరాజు బాబూజీ, దామరాజు శంకరం, అనురాధ, హరిప్రియ, డాక్టర్ హరిచందన్, సోమేశ్వరరావు, రాజభూషణం, జీఎస్ఏ నరసింహం, నీలాద్రి, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.